నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | శనివారం 27 జనవరి 2024 | MAHABUBABAD





హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



ములుగులో విద్యార్థిని నృత్య ప్రదర్శన

# త్రివర్ణ సంబురం..



## ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవం

- జిల్లాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్లు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసా పత్రాల అందజేత

త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ఉమ్మడి వరంగల్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం 75వ గణతంత్ర వేడుక అంబరాన్నంటింది. కలెక్టర్లు ఎక్కడికక్కడ జాతీయ జెండాలను ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిని వివరించారు. వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు.

– నమస్తే నెట్‌వర్క్, జనవరి 26



త్రివర్ణ పతాక రూపంలో కోటగుళ్ల గణపేశ్వరుడు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీ అంబర్‌కిశోర్ ఝాతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు మహేందర్ జీ, రాధికాగుప్తా పాల్గొన్నారు. అలాగే వరంగల్‌లోని ఖుష్‌మహల్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డీసీపీ రవీందర్, జనగామలోని ధర్మకంచ స్టేడియంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, వెస్ట్‌జోన్ డీసీపీ సీతారాం, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ కొత్త బస్సును ప్రారంభించిన కలెక్టర్ శివలింగయ్య.. డ్రైవర్ ఎండీ దావుద్‌కు ప్రశంసా పత్రాన్ని బస్సులోనే అందజేశారు. ఆ తర్వాత సతీమణి వందన, కుమారుడు రుత్విక్, డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్‌కుమార్, ఆర్టీసీ డీఎం జ్యోత్స్నతో కలిసి కొద్దిదూరం ప్రయాణించారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే మురళీనాయక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంబేద్కర్ స్టేడియంలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, ములుగులోని తంగేడు మైదానంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వేడుకల సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకోగా ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.



హనుమకొండలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, సీపీ



వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



జనగామలో జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య, ఎమ్మెల్యేలు పల్లా, కడియం



భూపాలపల్లిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా..



మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్..



ములుగులో కలెక్టర్ ఇలా త్రిపాఠి..



అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

# పోటెత్తిన మేడారం

## వనదేవతల దర్శనానికి భారీగా భక్తుల రాక



కలెక్టర్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జనవరి 26: మేడారం సమ్మక్క–సారలమ్మల సన్నిధికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వనదేవతల మహా జాతరకు మరికొద్ది రోజుల సమయం ఉన్నప్పటికీ ముందస్తుగా భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సైతం వాహనాల్లో మేడారం చేరుకున్నారు. ఉదయం నుంచి జంపన్న వాగు వద్దకు భక్తులు అధికసంఖ్యలో చేరుకొని పవిత్రస్నానాలు ఆచరించి తలనీలాలను సమర్పించి తల్లుల గద్దెల వద్దకు చేరుకొంటున్నారు. ఎత్తుబెల్లం, పసుపు, కుంకుమ, సారె, పూలు, పండ్లు, ఒడిబియ్యం సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతల దర్శనానికి భక్తులు పోటెత్తడంతో అడిషనల్ కలెక్టర్ శ్రీజ గద్దెల పరిసరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

**పనుల్లో వేగం పెంచాలి : మంత్రి సీతక్క**

మేడారం మహాజాతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచి గడువులోపు పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం జాతర పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పనుల పురోగతిని పరిశీలించారు. వీఐపీ, వీవీపీ పార్కింగ్ స్థలాలు, రోడ్లను, పీఆర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్లతో పాటు పార్కింగ్ స్థలాలను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం జంపన్నవాగులో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాట్లు, తాత్కాలిక గదులను పరిశీలించి త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా శ్రద్ధతో చేయాలని, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

# స్థాయిని మరిచి సీఎం రేవంత్ మాటలు

- అధికారం కోసం పచ్చి అబద్ధాలు
- ప్రజలను మభ్యపెట్టి గెలిచిన కాంగ్రెస్
- వంద రోజుల్లో 50 రోజులు గడుస్తున్నాయ్
- అందుకే ఆరు గ్యారెంటీలను గుర్తుచేస్తున్నం
- బీఆర్ఎస్‌పై నిందవేసి కాలయాపనకు యత్నం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి

జనగామ, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలతో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి గెలిచిందని స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి అనే సంగతి మరిచిపోయి స్థాయి దిగజారి మాట్లాడుతుంటే మంత్రులు అహంకారంతో రెచ్చిపోతున్నారని అన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు 50రోజులు గడుస్తున్నాయని గుర్తుచేస్తుంటే సీఎం, మంత్రులు ఇంతెత్తున ఎగురుతున్నారని ఆగ్రహించారు. రైతుల పంట రుణాలు రూ.2లక్షల వరకు రుణమాఫీ ఫైల్‌పై ప్రమాణస్వీకారం చేసిన రోజే మొదటి సంతకం చేస్తానని చెప్పాడని తెలిపారు. కానీ ఈరోజు వరకు రైతు భరోసా పూర్తిస్థాయిలో అందలేదని, నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టి ఆరు గ్యారెంటీల అమలును పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వరకు తీసుకొచ్చి కాంగ్రెస్ సర్కారు కాలయాపనకు ప్రయత్నిస్తోందన్నారు. కేసీఆర్‌ను చార్లెస్ శోభరాజ్‌గా, కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా రంగలతో పోలుస్తూ అవహేళనగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని అన్నారు. శోభరాజ్, బిల్లా రంగల కంటే రేవంత్ చరిత్ర గొప్పదా? నువ్వు ఎన్ని కేసుల్లో ఉన్నడో తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులు కాళేశ్వరం మీద పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, 1.25లక్షల ఎకరాలకు నీళ్లు విడుదల చేశామని సిద్దిపేటలో మంత్రి కొండా సురేఖ అంటే మరో మంత్రి 50వేల ఎకరాలకు కూడా నీళ్లు రాలేదంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం, మంత్రుల భాష, భయపెట్టే ధోరణి మంచిది కాదని, అధికారం వచ్చింది కాదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతామంటే చెల్లదన్నారు. బెదిరింపులకు భయపడకుండా మరింత ఉత్సాహంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా, గవర్నర్ వ్యవస్థకు కళంకం తెచ్చేలా బీజేపీ నాయకురాలి ముసుగులో వ్యాఖ్యలు చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని ఎమ్మెల్యేలు కడియం, పల్లా అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు, ఈ ప్రభుత్వం చేసే తప్పులకు గవర్నర్ బాధ్యులని, తప్పులు అంగీకరించడమంటే అది మీ బలహీనత అన్న సంగతి తెలుసుకోవాలని హితవు పలికారు. గవర్నర్ వ్యాఖ్యలపై మేధావులు, విద్యావంతులు స్పందించాలని పిలుపునిచ్చారు. తమిళిసై తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్ కోటాలో కోదండరాంను ఎమ్మెల్సీగా అనుమతించిన తమిళిసై గతంలో దాసోజు శ్రవణ్ విషయంలో ఎందుకు నిరాకరించిందని ఎమ్మెల్యే కడియం, పల్లా ప్రశ్నించారు. ఎమ్మెల్సీ షెడ్యూల్ రెండు విడుతలుగా ఇవ్వడమే కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయినట్లు అర్థమైందని, గవర్నర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. 1.75లక్షల ఉద్యోగాలు గత ప్రభుత్వం ఇచ్చింది, కావాలంటే శాఖల వారీగా వివరాలు అడిగితే ఇస్తారని, యూనివర్సిటీలో ఉద్యోగాల ఫైల్ గవర్నర్ తొక్కిపెట్టలేదా? మేం తీసుకుంటే తప్పని చెప్పి రిటైర్డ్ వాళ్లను ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. గవర్నర్ రాజకీయ నాయకురాలిగా వ్యవహరిస్తున్నారని, రాజీనామా చేసి బీజేపీ తరపున పోటీ చేసుకోవచ్చని ఎమ్మెల్యేలు కడియం, పల్లా సూచించారు.

**చోటా నయీమ్‌లా.. తీన్మార్ మల్లన్న**

పోలీసులు, ఇంటలిజెన్సీ వ్యవస్థ, కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి తీన్మార్ మల్లన్నను తెలంగాణలో చోటా నయీమ్‌లా తయారు చేస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తన మీద కక్ష సాధించాలని రోజూ ఏదో ఒక కేసు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసి తప్పుడు కేసులు పెట్టినా తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తన మీదే కేసు పెడుతున్నారంటే పేదల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, పోకల జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు స్వరూప, ప్రేమలతారెడ్డి, కమలమ్మ, బీఆర్ఎస్ నాయకులు ఏబెల్, గుర్రం నాగరాజు, గజ్జెల నర్సిరెడ్డి, సందీప్, ఉడుగుల నర్సింహులు, తిప్పారపు విజయ్, పల్లవి, పెద్ది రాజిరెడ్డి ఉన్నారు.



అంజిత్‌కుమార్(ఫైల్)



విజయ్(ఫైల్)

# గణతంత్ర వేడుకల్లో విషాదం

- జాతీయ జెండా ఎగురవేసే క్రమంలో విద్యుత్ షాక్‌తో ఇద్దరి యువకుల మృతి
- మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి సీతక్క, జడ్పీచైర్‌పర్సన్ నాగజ్యోతి

ములుగు రూరల్, జనవరి 26: ములుగు జిల్లా కేంద్రంలో గణతంత్ర వేడుకల్లో శుక్రవారం విషాదం నెలకొంది. మువ్వన్నెల జెండాను ఎగురవేసే క్రమంలో రెప్పపాటులో ఇద్దరి జీవితాలు గాలిలో కలిసిపోయాయి. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన బోడ అంజిత్‌కుమార్(36), లాడె విజయ్(25), లాడె చక్రి తోటి స్నేహితులతో కలిసి శివాలయం ఎదుట ఉన్న జెండా గద్దె వద్ద గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇనుప పైపునకు జాతీయ పతాకాన్ని కట్టి గద్దెపై నిలిపేందుకు పైకి లేపగా అది 11కేవీ విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయారు. గమనించిన తోటి మిత్రులు, కాలనీవాసులు ముగ్గురిని చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అంజిత్‌కుమార్, విజయ్ అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. అపస్మారక స్థితిలో ఉన్న చక్రికి వైద్యం అందడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క ప్రభుత్వ దవాఖానకు చేరుకొని చక్రితోపాటు మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారిని ఓదార్చి తక్షణ సాయంగా రూ.10వేల చొప్పున రెండు కుటుంబాలకు అందించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి అంజిత్‌కుమార్, విజయ్ కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మృతుల కుటుంబాలను పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.